కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 20, పచ్చిమిర్చి 50 , బెండ 40, కాకర 60, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 60, కీర 40, బీర 60, వంకాయ 40, గోకర 50, బీన్స్ 130, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 20, క్యారెట్ 40, చిక్కుడు 100, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

వృద్ధులకు పండ్లు పంపిణీ



ఓల్డేజ్ హోమ్‌లో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

మియాపూర్: దీప్తిశ్రీనగర్ కాలనీలోని శ్రీ షిరిడీ సాయి ఓల్డేజ్ హోమ్‌లో హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు శనివారం నిర్వహించారు. వృద్ధాశ్రమంలో కేక్‌కట్ చేసి వృద్ధులకు స్వీట్లు, పండ్లు, కేక్‌లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగులుగౌడ్, మహేష్‌యాదవ్, అశోక్, రవి, శ్రీనివాస్, గణేష్, రాము, జితేందర్, రవిగౌడ్, బాలాజీ, కృష్ణ తదితరులున్నారు.

ఎన్యూమరేటర్ల వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గత 6నెలల క్రితం ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లకు ఇవ్వవలసిన డబ్బులను వెంటనే ఇవ్వాలని కోరుతూ మహిళ సంఘాల సభ్యులు శనివారం మున్సిపల్ మేనేజర్ అఖిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్యూమరేటర్లకు రూ.10వేలు ఇస్తారని మున్సిపల్ కమిషనర్ చెప్పారని కానీ నేటికి అందుకు సంబంధించిన డబ్బులు ఇవ్వలేదని దీనిపై అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



నగదును అందజేస్తున్న కొండ విజయ్ కుమార్

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ కాలనీలో గల రేణుక ఎల్లమ్మ ఆలయం అభివృద్ధి పనులకు హోప్ ఫౌండేషన్ విరాళం అందజేశారు. శనివారం చందానగర్ హుడా కాలనీలోని హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో చైర్మన్ కొండ విజయ్‌కుమార్ రూ.36వేలు నగదును బిగ్ బాస్ రియాల్టీ షో ఫేమ్ జెస్సీ జశ్వంత్ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మహేష్ కుర్ర, ఫౌండేషన్ సభ్యులు రవికుమార్, అపర్ణ, ఆలయ కమిటి సభ్యులు అనంతరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ట్యాంకర్ డ్రైవర్

గచ్చిబౌలి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి కేసులో రాయదుర్గం పోలీసులు వాటర్‌ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నాలెడ్జి సిటీలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు ప్రమాదానికి కారణమైన వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఫుట్‌పాత్ పక్కన ఉన్న వ్యక్తిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని, డ్రైవర్ పట్టించుకోకుండా వెళ్లినట్లు తెలుస్తోంది. మృతుని వివరాలు తెలియలేదని పోలీసులు తెలిపారు.

న్యూట్రిషన్ కిట్లు అందజేత

పటాన్‌చెరుటౌన్: క్షయ వ్యాధి బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ యూనిట్‌లో క్షయ వ్యాధిగ్రస్తులకు బ్రౌజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫుడ్ బాస్కెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... ఒక పేషెంట్‌కు ఆరు నెలలకు సరిపడా పోషకాహారం అందించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ ప్రవీణ, బ్రౌజ్ ఫౌండేషన్ డాక్టర్ వెంకట్, హెచ్ఈఓ సుగుణాకర్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి మెగా ఉచిత వైద్యశిబిరం

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలోని తొండుపల్లి జెడ్పీహెచ్ స్కూల్‌లో సోమవారం నుంచి పది రోజుల పాటు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఏఐజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు, మందులు ఉచితంగా చేపట్టనున్నట్లు నిర్వాహకులు పారెపల్లి శ్రీనివాస్‌గౌడ్, పెదిరిపాటి ప్రవీణ్‌గౌడ్, కొండ ప్రవీణ్‌గౌడ్ వెల్లడించారు. వైద్యశిబిరాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

సౌర విద్యాలయాలు

విద్యుత్ ఆదా, పొదుపు చర్యల్లో భాగంగా ఏర్పాటు

రాయదుర్గం: నగర శివారు ఐటీకారిడార్ ప్రాంత పరిసరాల్లోని పలు ఉన్నత విద్యాసంస్థల్లో సోలార్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. సౌర విద్యాలయాలుగా మారాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి, టెలికామ్‌నగర్ పరిధిలోని జాతీయ స్థాయి విద్య, శిక్షణా సంస్థలలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టాయి. విద్యుత్ వ్యయాన్ని గణనీయంగా తగ్గించేందుకు.. క్యాంపస్‌లలో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకునేందు ముందుకుసాగుతున్నాయి. భవిష్యత్‌లో పూర్తిగా సౌరవిద్యుత్ వాడడానికి ఆలోచిస్తున్నారు.

- టెలికామ్‌నగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)
- గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)
- గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా
- టెలికామ్‌నగర్‌లోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం
- ఎస్కీలో ఖాళీ స్థలంలో కూడా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

నిథమ్‌లో..

- నిథమ్‌లో 35వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 200 కిలోవాట్ల సామర్థ్యం.. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు.
- క్యాంపస్‌లోని అకడమిక్ బ్లాక్ భవనం రూఫ్ టాప్‌పై 60 కిలోవాట్లు, హాస్పిటాలిటీ బ్లాక్ భవనంపై 100 కిలోవాట్లు, బాలుర హాస్టల్ భవనం-1పై 15 కిలోవాట్లు, బాలుర హాస్టల్ భవనం-2పై 25 కిలోవాట్ల సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు.
- వీటి ద్వారా 140 నుంచి 150 కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.
- దీనికోసం రూ.93 లక్షల వ్యయం చేశారు. ఈ సోలార్ పవర్‌తో నెలకు రూ.2.50 లక్షల విద్యుత్ బిల్లు ఆదా చేస్తున్నారు.
- క్యాంపస్‌కు రోజుకూ 900 యూనిట్ల విద్యుత్ అవసరం కాగా సోలార్ ద్వారా 1200 యూనిట్ల ఉత్పత్తికి ప్రణాళికలు చేశారు. అదనపు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించాలని భావిస్తున్నారు.



ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ..

ఎస్కీలో..

- గచ్చిబౌలిలోని ఈఎస్‌సీఐలో సోలార్ పివి గ్రిడ్ ఆఫ్ 20 కెడబ్ల్యూపి ఇంటరాక్టివ్ పవర్ ప్లాంట్‌ను 2015లో ప్రారంభించారు.
- క్యాంపస్‌లోని కౌటిల్య, చాణిక్య భవనాల అవసరాలను తీర్చడానికి సోలార్ పవర్‌ను వినియోగిస్తున్నారు.
- 2015లో 80 కెడబ్ల్యూపీ ఇంటర్యాక్టివ్ పవర్ ప్లాంట్ మరో గ్రిడ్‌ను ప్రారంభించారు.
- క్యాంపస్‌లోని పరిపాలనా భవనం, డైనింగ్ హాల్, కన్సల్టెన్సీ విభాగం విద్యుత్ అవసరాలను తీరుస్తున్నారు.

హెచ్‌సీయూలో..

- హెచ్‌సీయూలో మొదట 1.140 మెగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేశారు.
- విద్యుత్ బిల్లు నెలకు రూ. 14 లక్షల వ్యయం తగ్గింది. 15 శాతం విద్యుత్ అవసరాలు తీరుతున్నాయి
- భవిష్యత్తులో 5 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి 2 మెగావాట్ల చొప్పున రెండు దశల్లో సామర్థ్యాన్ని పెంచాలని తాజాగా ప్రతిపాదించారు.
- ఇందిరాగాంధీ మెమోరియల్ లైబ్రరీపై 100 కేవీ సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.



ఉర్దూ విశ్వవిద్యాలయంలో..

- గచ్చిబౌలిలోని టెలికామ్‌నగర్‌లో 200 ఎకరాల్లో విస్తరించిన మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం సోలార్ పవర్‌పై దృష్టిపెట్టింది.
- 'మనూ'లో ప్రస్తుతం 500 కేవీఏ విద్యుత్ అవసరం. దశలవారీగా పూర్తిగా సౌర విద్యుత్ వాడాలని సంకల్పించారు.
- వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ 2022లో సోలార్‌పవర్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు .
- ఆన్ గ్రిడ్ మోడ్‌లో 100 కేవీఏ సామర్థ్యం గల సౌర ఫలకాలను ఏర్పాటు చేశారు. మలివిడతలో మిగతా భవనాలపై ఏర్పాటు చేయాలని సంకల్పించారు.

రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోంది

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి

చందానగర్: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి పేర్కొన్నారు.టీపీసీసీ ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ,కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడ కిన్నెర హోటల్‌లో శనివారం కార్యకర్తలు, నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్నారు. ప్రభుత్వం దశలవారీగా ఎన్నికల హామీలు నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, దొడ్ల వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘునందన్ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, మహేష్ యాదవ్, నల్లా సంజీవ రెడ్డి, సునీతా ప్రభాకర్‌రెడ్డి, నగేష్ నాయక్, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటినుంచి ఆలయ వార్షిక వేడుకలు

మోతీనగర్: మోతీనగర్‌లోని శివరామాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ జగద్గురు శంకరాచార్య, శ్రీ విద్యారణ్య భారతీస్వామి పర్యవేక్షణలో సోమవారం నుంచి గురువారం వరకు ఆలయ ద్వితీయ వార్షిక వేడుకలు నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం ,అంకురార్పణతో వేడుకలు ప్రారంభమవుతాయి.

అభివృద్ధి పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయాలి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



వరదనీటి కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: అభివృద్ధి పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని గాయత్రి ఎన్‌క్లేవ్ కాలనీ నుండి బొల్లారం మెయిన్ రోడ్డు వరకు రూ.కోటి50లక్షలతో నూతనంగా చేపట్టిన వరదనీటి కాల్వ పనులను జీహెచ్ఎంసీ అధికారులు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షకాలంలో వరదముంపు సమస్య శాశ్వత పరిష్కారం దిశగా రూ.కోటి50 లక్షలతో కాల్వ పనులను చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అధికారులు డీఈ దుర్గాప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్, నాయకులు తదితరులున్నారు.

'ఆరంభ టౌన్‌షిప్ స్థలం వేలం వేయొద్దు'

శేరిలింగంపల్లి: గోపీనగర్‌లోని బీసీ హాస్టల్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంను కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని, రక్షించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవికుమార్ నాయకత్వంలో పలువురు ఈ స్థలాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ స్థలంలో మినీఫంక్షన్ హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. స్థలాన్ని వేలం పాట ద్వారా విక్రయిస్తే నిరాహారదీక్ష చేపడతామని స్పష్టం చేశారు. రోజూ 70 నుంచి 100 మంది పిల్లలు ఈ గ్రౌండ్‌లో ఆడుకుంటుంటారని , అధికారులు తమ ఆలోచనను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, శ్రీకాంత్‌యాదవ్, మల్లేష్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, శ్రీనివాస్, శంకర్, కృష్ణ, శివాజీ, సాయినందన్ ముదిరాజ్, పవన్, శంకర్ పాల్గొన్నారు.



గోపీనగర్‌లోని ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

టై విజేతగా ఫెమిలియర్ ఫేసెస్



గచ్చిబౌలి: టై యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ప్రాంతీయ ఫైనల్స్‌లో ఫెమిలియర్ ఫేసెస్ జట్టు విజేతగా నిలిచింది. శనివారం గచ్చిబౌలిలోని ప్యూజి కార్యాలయంలో టీఈఐ ఆధ్వర్యంలో 16వ టై యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (టీవైఐ) ప్రాంతీయ ఫైనల్స్ నిర్వహించారు. ఫెమిలియర్ ఫేసెస్ జట్టు సభ్యులు సాత్విక్‌రెడ్డి చెన్నా, అభిరాం నోరీ, జగదీష్ ఎలు విజేతలుగా నిలిచారు. రన్నరప్‌గా ఇంక్లూడ్, సెకండ్ రన్నర్‌గా ఎర్త్‌వార్మ్ జట్లు నిలిచాయి. విజేత జట్టు ఢిల్లీలో జరగనున్న గ్లోబల్ టై ఫైనల్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తుందని, వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా రన్నరప్ జట్టు పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీఈఐ (ద ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్) గ్లోబల్ చైర్మన్ మురళి బుక్కపట్నం, హైదరాబాద్ అధ్యక్షులు రాజేష్ పగడాల, టీవైఈ హైదరాబాద్ అధ్యక్షుడు సుబ్బరాజు పెరిచర్ల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులకు కొత్త ఫోన్ నంబర్లు

మణికొండ: విద్యుత్‌శాఖ అధికారుల అధికారిక ఫోన్ నెంబర్‌లను సోమవారం నుంచి మార్చుతున్నట్టు డీఈ రమేష్‌చంద్ర తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ నుంచి ఎయిర్‌టెల్‌కు తమ ఫోన్ నెంబర్లు మారుతున్నాయన్నారు. అందులో భాగంగా ఇబ్రహీంబాగ్ (నార్సింగి) డీఈఈ ఫోన్: 87124 69551, ఇబ్రహీంబాగ్ ఏడీఈ ఫోన్: 87124 69552, మణికొండ ఏఈ ఫోన్: 87124 69557, నార్సింగి ఏఈ ఫోన్: 87124 69550, ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆఫీస్‌కు ఫోన్: 97124 69586 నెంబర్లు ఉంటాయని ఆయన వివరించారు.

తిరంగా ర్యాలీ

మాదాపూర్: భారతసైన్యానికి మద్దతుగా శనివారం తిరంగయాత్రను నిర్వహించారు. మాదాపూర్‌లోని న్యాక్ గ్రౌండ్స్ వద్ద నుంచి మెటల్ చార్మినార్ వరకు ర్యాలీని నిర్వహించినట్టు పార్టీ మాదాపూర్ నాయకుడు గంగల రాధాకృష్ణయాదవ్ తెలిపారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, శివయాదవ్, ఆనంద్, సుమన్ నాయక్, శీనునాయక్, జయదేవ్ తివారి, నరేశ్‌రెడ్డి, జగన్ యాదవ్, సూర్యవంశం, లింగస్వామి పాల్గొన్నారు.



న్యాక్‌గ్రౌండ్ వద్ద తిరంగ ర్యాలీ

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీలోని శ్రీభూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, సామూహిక పారాయణాల అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శనివారం ఆలయంలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే గాంధీ, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటిశ్రీకాంత్ పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణ, కాలనీ ప్రతినిధులు సుధాకర్, కారెం రవీందర్ రెడ్డి, విఠల్, కృష్ణారెడ్డి, హన్మనాయక్, కృష్ణమోహన్, సంజీవయ్య పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనాలు

మోతీనగర్: శ్రీ శృంగేరి శారద శంకరమఠం బ్రాహ్మణ అభ్యుదయ సమితి ఆధ్వర్యంలో శనివారం మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని శ్రీశారద శంకరమఠం ఆవరణలో పలువురికి సామూహిక ఉపనయనం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యుదయ సమితి అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ అభ్యుదయ సభ్యులు రామచంద్రరావు, అనిత, కొండూరి శంకరనారాయణ పాల్గొన్నారు.

చెరువు పూడికతీత పనులు పూర్తి చేయాలి

మోతీనగర్: చెరువు పూడికతీత పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సున్నం చెరువులో హైడ్రా చేపడుతున్న చెరువుల సుందరీకరణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా చెరువు పూడికతీత పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో గాయత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారావు, సంజీవరెడ్డి, జితేందర్, బ్రహ్మం పాల్గొన్నారు.

20న శంషాబాద్‌లో తిరంగా ర్యాలీ

రాజేంద్రనగర్: ఆపరేషన్ సిందూర్ విజయోత్సవంగా కొనసాగిన నేపథ్యంలో ఈ నెల 20వ తేదీన శంషాబాద్‌లో తిరంగా ర్యాలీని నిర్వహించనున్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రాజ భూపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్ అధ్యక్షతన రాజేంద్రనగర్ డివిజన్ మీటింగ్ పీఆర్ ప్యాలెస్‌లో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్, రాజేంద్రనగర్ డివిజన్ ప్రభారి ప్రభాకర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ ముదిరాజ్, వాసు, హరికిషన్ జీ, సోల్కర్ రెడ్డి, విట్టల్, కీర్తి, శ్రీను, మల్లేష్ చారి, స్వప్నా రెడ్డి, సరితా రెడ్డి, రజనీకాంత్ గుప్తా, రాజశేఖర్ రెడ్డి, మహేశ్ ముదిరాజ్, రవీందర్ రెడ్డి, విజయ్ యాదవ్, పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం నాద ముద్ర స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ గురువు చైతన్య కుసుమప్రియ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. ఇందులో గణేశపంచరత్న , కౌతం, శృంగారలహరి, సప్తతాండవం, సూర్యాష్టకం, అర్ధనారీశ్వరాష్టకం, తిల్లాన, మంగళం తదితర అంశాలను రీతుపర్ణ, ఆశ్రిత సాయి, హరిణి, అనన్య, తరిణి, నిహారిక, మానస, శ్రీలత, డాక్టర్ ఆనంద్ మీనన్, రమ్యప్రదీప్‌లు ప్రదర్శించారు. డాక్టర్ శ్రిష్టి బుధోరి భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇందులో దశావతారం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు.

సమ్మర్ ఆర్ట్ క్యాంపు .. సర్టిఫికెట్లు అందజేత

సమ్మర్ ఆర్ట్ క్యాంపులో శిక్షణ పొందినవారు వేసిన చిత్రాలను శనివారం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు ప్రారంభించారు. ఆర్ట్ క్యాంపులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్‌లను అందజేశారు.



అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శ్రీదీప్తి నృత్యాలయం కూచిపూడి , జానపద నృత్యాలతో అలరించారు. కళాకారులు లక్ష్మిశ్రేష్ఠ, సౌమ్యరెడ్డి, మాన్విత, ప్రియా రెడ్డి, తన్వి, దివ్య, మాన్య, పూర్విక, శ్రీకరి, దృశిక, ఇ.ఆన్వి, మనస్వి, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు. మూషికవాహిని, వినాయకకౌతం, శ్రీవిఘ్నరాజం భజే, అదివోఅల్లదివో, రామాయణశబ్దం తదితర అంశాలను ప్రదర్శించారు. జానపద నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం కళాకారులకు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ శోభారాజు జ్ఞాపికలను అందజేశారు.



అన్నమయ్యపురంలో..

గోల్ఫ్ @ బౌల్డర్‌హిల్స్ న్యూస్‌లెటర్ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అత్యుత్తమ గోల్ఫ్ కోర్సుగా పేరు తెచ్చుకున్న గచ్చిబౌలీలోని బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్ న్యూస్ లెటర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. గత మూడు నెలలుగా బౌల్డర్ హిల్స్ వేదికగా జరిగిన పలు టోర్నీ వివరాలతో రూపొందించిన న్యూస్ లెటర్‌ను మహిళా గోల్ఫర్ల ప్రశంస, డాక్టర్ శ్వేత గుల్లపల్లితో కలిసి టీ గోల్ఫ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఆర్ఎన్ రెడ్డి, ఎమ్మార్ ప్రాపర్టీస్ సీఎఫ్ఓ మధుసూదన్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమ్మర్ స్లామ్-2025 పేరుతో నిర్వహించిన టోర్నీలో విజేతలకు ట్రోఫీలు అందజేశారు. స్టేబుల్ ఫోర్డ్ ఫార్మాట్‌లో నిర్వహించిన ఈ టోర్నీకి మంచి స్పందన లభించిందని, దాదాపు 100 మందికి పైగా ఔత్సాహిక గోల్ఫర్లు పాల్గొన్నారని బౌల్డర్ హిల్స్ సీఎఫ్ఓ మధుసూదన్ రావు చెప్పారు. తెలంగాణలో గోల్ఫ్ క్రీడకు ఆదరణ పెరగడం, ముఖ్యంగా మహిళా గోల్ఫర్ల ప్రాతినిధ్యం పెరుగుతుండడం సంతోషంగా ఉందని టీ గోల్ఫ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఆర్ఎన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో అత్యుత్తమ ప్రమాణాలతో గోల్ఫ్ కోర్సుగా పేరున్న బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ కంట్రీ క్లబ్‌పై న్యూస్‌లెటర్ రావడం అభినందనీయమన్నారు.



న్యూస్‌లెటర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రతి కాలనీకి రక్షిత మంచినీరు



పైపులైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలకు సైతం రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో గల అపార్ట్‌మెంట్‌వాసుల కోసం 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న పైపులైన్ పనులకు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ తో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి మంచి నీరు అందించాలని లక్ష్యంతో నూతన రిజర్వాయర్లు, పంపు హౌస్‌లు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కృషి డిఫెన్స్ కాలనీ అధ్యక్షులు అమరేందర్, ప్రధాన కార్యదర్శి మాణిక్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.